బోగం మేళం

పెళ్ళిభోజనంచేసి తాంబూలం వేసుకుంటున్నారు. రాత్రి తొమ్మిదిన్నర అయింది. ఈపాటికి లేచిపోవలసిందే ఎవరిళ్ళకు వాళ్లు. కాని బయట వాన కురుస్తోంది. కాదున్నవా రదృష్టవం తులు. వారుమాత్రం గొప్పగా వెళ్లిపోయినారు.

"వాన వెలిసేట్టు లేదు. ఏం చేద్దాం?"

"ఈ ముదనష్టపు బిల్లు రాకపోతే మనవాడు బోగంమేళం పెట్టేవాడే! ఏం సాంబయ్యా? హాయిగా యిప్పుడు ఆడించుకుం దుము."

"తప్పకుండా. ఏమిటాబిల్లు? బోగంమేళాలు పరిపాలన కేం అడ్డమొచ్చాయ్!"

"నీతి ప్రభుత్వమోయ్!"

"మేళాలకీ, నీతికీ సంబంధం!"

"వాళ్లు అట్లా బహిరంగంగా ఆడితే చూసినవాళ్ళలో...."

"తెలివితక్కువగా మాట్లాడకు. ఇంకా బోగంవాళ్లు చీరెలు కప్పుకొని ఆడతారు. భరతనాట్యమని పేరుపెట్టి పైనో గుడ్డా, కిందోగుడ్డా కట్టుకుని పసిపిల్లలూ, ముసలమ్మలూ రంగులు పూసుకుని, సినిమాల్లోనేకాదు, గవర్నర్లముందుకూడా తైతక్క లాడితే, చాలా బావుంది. ఏం?"

"కాని, వాళ్ల వేశ్యలు కాదుగా?"

"వేశ్యలకి డబ్బు చెల్లించుకోవాలి. వాళ్ళకు అదీ అక్క ర్లేదు!'

అసలు అది కాదురా. ఈ భోగంకులానికి అది అవమానమని"

"పాకీవాళ్ళని రద్దుచెయ్యరేం?"

"కౌన్సిలు మెంబర్లకి ఇబ్బందికదూ; అందుకని."

"ఇదీ ఇబ్బందే! కాని బయటికి ఆ మాట, సభలో అనే ధైర్యం పోయింది"

"ఈ బిల్లు చేసినవాళ్ళు వ్యభిచారచరిత్ర ఎవరన్నా చదివారంటావా? ఏదో కీర్తికోసం చేసిన పనులు తప్ప"

"ఇట్లాంటి బిల్లులు చాలా అపాయకరం. పాకీవాళ్ళని రద్దుచేస్తే వాళ్ళపనిని యంత్రాలన్నా చెయ్యాలి, లేకపోతే ఎవరికివారన్నా చేసుకోవాలి. వేశ్యలపని యంత్రాలు చేయలేవు. కనక సంసారస్త్రీలే చేస్తారు ఆపని. మనుష్యులు వుత్త యంత్రాలనీ, తక్కిన శక్తులమల్లేనే మనుష్యస్వభావాన్ని కూడా అధీనంలోకి తీసుకురాగలమనే ఉద్దేశ్యం బయలుదేరిందోయ్. నాజీజం, కమ్యూనిజం సిద్ధాంత మది" అన్నాడు కాలేజీ ప్రిన్సిపాల్.

"తక్కిన దేశాల్నించన్నా పాఠాలు నేర్చుకోరు. మనం చరిత్రను బోధిస్తాం. కాని, చరిత్రనుంచి ఏమీ నేర్చుకోము"

"మనదేశప్రజలు వేరనేగా మొదటినుంచీ కాంగ్రెసువారి వాదన. మన ప్రజలకి తాగుడు లేకపోయినా ఇబ్బందిపడరు. ఏదో భోగంవాళ్ళు ఉన్నారు గనుక వాళ్ళమీద దయతలిచి ఉపయోగించుకుంటారు గాని, అసలు అటువంటి బుద్ధే లేదు భారత స్త్రీకి ఎంత స్వతంత్రం వచ్చినా సీతా దమయంతుల మూర్తుల్ని హృదయంలో ఆరాధిస్తో, పతిసేవలో నిమగ్నమై ఉంటుందనే కద?"

"మొన్న నా క్లయింటు వెంకయ్య అంటున్నాడు— ఈ బిల్లు రావాలని. తన కులానికి తను సంస్కరణనాయకుడు కావాలనీ అతని ఆశలే. చాలాతంటాలుపడ్డాడు ఈ బిల్లుకోసం. ఇగేమిటండీ, బిల్లుపెట్టించి పెళ్ళిచేసుకోమంటే, ఈ....... లు పెళ్ళి అని ఏదో చేసుకుని, సంపాదన యథాప్రకారమే సాగించారూ!"

"ఏమోగాని, పెళ్ళిళ్ళలో భోగంమేళాలు తీసెయ్యడం చాలా మంచిపని చేశారు" అన్నాడు రాజారావు.

"ఏం?"

"చాలా మనుషుల్ని పాడుచేస్తాయండి. పెళ్లి హడావిడిలో దంపతులు యెడమై వుంటారు. అదీగాక మంచి భోజనం, అత్తరూ, సంగీతం, బనారసు చీరెలూ....చాలా ఉద్రేకంగా ఉంటుంది. పైగా ఎదురుగా నడుములూ, కళ్ళూ తిప్పుతో వీళ్ళూ"

"హాలిడే స్పిరిట్ అంటావు."

"మరి యీ సంగతి యోచించు. ఈ భోగంవాళ్ళన్నా యెదురుగా లేకపోతే, పెళ్లి హడావిడిళ్లో ఎవరు ఎవరిపెళ్లాలో గుర్తులు తప్పిపోతాయి."

"అంతే కాదు. చాలా త్వరలోనే భరతనాట్యంవాళ్లని పిలిపించి నృత్యాలు చేయించుకుంటారు."

"నిజంగా జరిగిన ఓ కథ చెబుతా వినండి-వాన తగ్గలేదు ఇంకా. కాలేజీలో చదువుకుంటున్నాం. నా ప్రాణస్నేహితుడు, రూంమేట్, ప్రభాకరం పెళ్ళికి వెళ్ళాను. ఎవరి కంటావు? హైకోర్టుజడ్జీ కూతురికి. ఉద్దండుడు ఆయన. కూతురికి శరీరావసరమని గాని, లేకపోతే పెళ్ళిచెయ్యడమనే తక్కువ స్థితికి దిగడనుకో. పదివేలు కట్నం మా బీద ప్రభాకరానికి. ఒక్కతే కూతురు గనక,

ముందుముందు ఆ స్తికి హక్కుదారుడు మావాడు. కాని, మేం తర్లివెళ్ళిననాటినించీ, మమ్మల్ని యేదో ముష్టివాళ్ళమల్లే చూశాడు ఆ జడ్జి. అన్ని సౌకర్యాలూ గొప్పగా వున్నాయి. కాని ఆ వాతావరణం, "మీవంటివాళ్ళని నేను ఆదరించాల్సివొచ్చింది, నా కూతురు కారణంగా" అన్న బాధ. ఈ జమీందార్లు చూడు—మర్యాద చేస్తారు, అట్లా. మర్యాదే—మిమ్మల్ని మర్యాద చెయ్యకపోతే, మా మర్యాదకి లోపం కనక మిమ్మల్ని మర్యాద చేస్తున్నాం. అంతేగాని........ఎంత దొంగతనం అంటావు. అందరికంటే యెక్కువ వినయం చూపుతారు. కాని ఆ వినయం వెనక చాలా గర్వం. జమీందార్లే అక్కర్లేదు, వాళ్ళదగ్గిర నాలుగేళ్ళు వున్నవాళ్ళకి కూడా వొస్తుందది. అవును. గాయకుడివి, నీ దగ్గిర కళవుందిగనక, కళను ఆదరించే ప్రభువుని నేను గనక, నిన్ను గౌరవం చేస్తున్నాను. అంతేగాని—నువ్వూ, నీ సంగీతం........" అన్నట్టు వుంటుంది. ఆ జడ్జీని చూస్తే నాకు, మేము యువక పురుగులం, అతని అల్లుడితోసహా "మీ మొహం, లక్ష జన్మలెత్తితే మీరు జడ్జీలు కాగలరా?" అంటున్నాయి అతని కళ్ళు.

ఆ జడ్జీగారికి ఓ తమ్ముడు ఉన్నాడు. అతను రసికావతంసుడు. జడ్జీగారిని అడక్కుండానే ఓ భోగంమేళంతో సహా దిగాడు పెళ్ళికి.

ఆయన వేశ్యాప్రియురాలికి ఓ పదహారేళ్ళ కూతురు ఉంది. ఆ కూతుర్ని ప్రకటించి, పైకి తీసుకురావాలని ఆయన ప్రయత్నం. తీరా భోగంమేళం వచ్చింది గనక, ఆమెవన్నీ వీలైనంత ఉపయోగించుకున్నారు ఆ పెళ్ళిలో. ఆ అమ్మాయిపేరు రాధ. ఆ రాధవంక సరిగా చూపన్నా పడనీడు ఆ జడ్జీ తమ్ముడు. నిజంగా

చాలా అందం— అందమేకాదు, ఆమెలో ఓ గుణం ఉంది. తల్లిలోనూ వుందిలే! అదే జడ్జీగారి తమ్ముణ్ణి ఆమె గుమ్మానికి కట్టేసింది అనుకున్నాం. రాధను చూస్తే, ఆమెనించి ప్రయత్నం లేకుండానే, చూసేవాళ్ళకి ఆమెను కావిలించుకోవాలనిపిస్తుంది. కావిలించుకుంటే ఆమె ఏమీ అనదనీ, కావిలించుకోమని ఆహ్వానిస్తోందనీ, రూఢిగా తెలిసినట్టవుతుంది. చాలామంది స్త్రీలలో వుంటుంది కొద్దో, గొప్పో ఇది. ఆ ఆకర్షణ వుండడంవల్ల, ఆ స్త్రీలకి సుఖమా, కష్టమా, అంటే—ఆ సంగతి వాళ్ళ తక్కిన గుణాలమీదనో, జాతకంమీదనో ఆధారపడుతుంది. ఏమయితేనేం, రాధ సంగతే మాట్లాడడం ఆ పెళ్ళిలో అందరూ. పైగా ఆమె పాడడం, ఆడడం, జాపళీలు అభినయం, ఆహ్వానం. వేళ్ళు, చేతులు, రొమ్ములనించి కాంతులు మా మీద ప్రయోగించడం. మా కోర్కెల్ని అణుచుకోలేక చాలా బాధపడ్డాం. పైగా ఆ జడ్జీ తమ్ముడు మా బుజాలమీద కొట్టి మాతో రాధని వర్ణించడం; ఆమె ప్రతిభసంగతి గమనించామో లేదో, మా వెంటబడి అడగడం. కాని మేము ఆమెవొంకనన్నా చూడకండా ఆమెని దాచెయ్యడం.

ఆ జడ్జీతమ్ముడు రాధ అనాఘ్రాతపుష్పమనిన్నీ, అట్లానే వుంచి కళకి ఆమెని అంకితం చెయ్యబోతున్నాననీ, పెళ్ళి సభలలో ప్రకటిస్తున్నాడు. ఎవరన్నా గట్టిగా ఆ అమ్మాయి వంక చూస్తే వాళ్ళని కొట్టడానికి సిద్ధమయ్యేవాడు. బోగం వాళ్ళకంతా వేరే గదులు; మేళంలో తక్కినవాళ్లూ, అయినా రాధకి కాపలా. ఇది ఇట్లా వుంటూండగా, పెళ్ళి మూడోరోజు

పొద్దున్న హడావిడి. పెళ్ళికొడుకు కనపడలేదని. ఇంకొంచెం సేపటికి ఇంకోమూలనించి రాధ కనపళ్ళేదని.

అని కథ చెప్పి రాజారావు మాట్లాడకుండా సిగరెట్ ముట్టించి దిండుమీద వాలాడు. నాలుగు నిమిషాలు చూసి,

"అంతేనా కథ?" అన్నారు ఒకరు.

"అంతకన్న ఏంకావాలి? బావుందా?"

"సరేలే. తరవాత?"

"తరవాత ఏముంది? ఎంత వెతికించినా కనపళ్ళేదు వాళ్లు. పెళ్లికొడుకుకి ఇచ్చిన పదివేలూ, వెండిపళ్ళాలూ లేవు. జడ్జీగారి తమ్ముడు చేయించి యిచ్చిన— రాధవి మూడువేల నగలూ లేవు. నా మిత్రుడేమైనాడని నేను గొడవపడ్డా. జడ్జీ కక్కే నురుగులు చూడ్డం నాకు చాలా వోదార్పు నిచ్చింది. బలేపనిచేశాడు అనిపించింది. పైగా స్త్రీ విషయికంగా చూస్తే, జడ్జిగారి కూతురికన్న రాధ ఎంత గొప్ప! ఆమె మామీద వెదజల్లిన మత్తు ఆకర్షణ, ఆమె పడకగదిలో చూపిందా మా మిత్రుడంత అదృష్టవంతుడు లేడని గర్వపడాలో లేక ఇంక వాడికి ఆమె సందిట నించి విముక్తి వుంటుందా అని విచారపడాలో తెలీలేదు." అని మళ్ళీ వూరుకున్నాడు.

"తరవాత?"

"అంతే!"

"జడ్జీగారు?"

"పెళ్ళి రద్దుచేయిస్తానని, కూతురికి మళ్ళీ పెళ్ళిచేయిస్తాననీ చిందులుతొక్కాడు. నవ్వాము ఆయన మొహాన. కాశేశ్వరరావు గారు ఇంకా జైలులోనే వున్నారు ఆనాటికి."

"పెళ్లికూతురు?"

"నామల్లేనే ఆమె ముసలిదౌతోంది. ఇప్పుడు, మిసెస్. అని ముందర వేసుకుంటుంది. కౌన్సిలు మెంబరు. మొన్న ఈ బిల్లుని చాలా ప్రోత్సాహపరిచింది."

"వాళ్ళిద్దరూ?"

కొంచెం వూరుకుని,

"చెప్పమంటారా? తరవాత పదేళ్ళకి గావును ఓవూళ్ళో కాఫీహోటలులో కనపడ్డాడు మా పెళ్ళికొడుకు. ఇద్దరం గుర్తు పట్టుకోగలిగాం. అతను ఆ వూళ్లో రాధతోనే వున్నాట్ట. కొంచెం 'సీడీ' గా అయినాడేమో ననిపించింది. కాని, ఏం చెప్పలేను. మామూలుగానే వున్నాడు. అంతే. ఘనకార్యం చేసినట్టుగాని, అంత రసికురాల్ని అనుభవించినందుకుగాని అతనిలో మార్పేమీ లేదు. దరిద్రమూ లేదు, ధనమూ లేదు. అప్పు డడిగాను—

"ఏం జరిగిందిరా? ఎందుకు వచ్చేశావు?" అన్నాను.

"ఏం లేదురా. పెళ్లికొడుకుని గనక రాధతో పరిచయం సులభమయింది. పెళ్లికొడుకు గ్లామర్ రాధ మనసులో పనిచేసిందిగావును"

"సరేలే. ఎందుకు మాయమైనావు?"

"నీ కా వీలు కలిగితే నువ్వు పారిపోయివుండవా?"

"ఏమోలే, అంతవరకూ రానివ్వనేమో"

"ఎంతవరకు?"

"అన్నిటినీ, అందరినీ వొదిలి పారిపోయేటంతవరకు"

"అంటే జీవచ్ఛవానివి గనక"

"సరేలే. ఆ అమ్మాయి ఎందుకు వచ్చిందిరా?"

"ఏమిటో! చాలాకాలమైంది. మరిచిపోయినాను. పినమామ గారిని తప్పించుకొని రాధగదిలోకి పోయి, ఆమె నాట్యాన్ని పొగుడుతున్నాను. దగ్గరగా నుంచొని, "ఏదో అందరూ అంటారు, ఆమాట" అంది. నేను ప్రత్యేకంగా అంటున్నానని ఆమెకి చెప్పే మార్గం, నాకు అది తప్ప ఇంకోమార్గం కనపడలేదు. అంతే ననుకుంటా. ఆవిధంగా తప్ప స్త్రీమీద ఇంకోవిధంగా గౌరవం కనపర్చలేమనుకో. అది వీలుండగా, వయసులో వుండగా, తక్కిన పొగడ్తలన్నీ వుత్త సారంలేని మాటలు. ఆమె అందం చూశావుగా! తనే నన్ను రాత్రి జడ్జీగారి స్టడీగదిలో కలుసుకో మంది. అక్కడా సోఫామీద నాట్యమాడిందనుకో. ఇంక ఆమె లేకండా బతకలేనని ఆ రాత్రే సోఫామీదే తెలిసిపోయింది నాకు. తరవాత పారిపోవడమా—? జీవితంలో ముఖ్యమైన మార్పులు జరిగే సంగతులు ఎందుకు చేశామో, ఎప్పుడూ అర్థం కాదను కుంటా"

"సరేకాని, ఇప్పుడేం చేస్తున్నావు?"

"ఏం లేదు. ఆ డబ్బుని జాగ్రత్తగా వాడ్డికి వేశాం. బాగానే బతుకుతున్నాం."

"రాధ వుందా నీ దగ్గిర? వాళ్ళ బంధువులు గోలచెయ్య లేదా?"

"మాకు తెలిసినవాళ్ళల్లో నిన్నే మొదట చూడడం."

ఆదేదీ నాకు బావుండలేదు. మిత్రుడు సుఖంగా వున్నా డంటే సంతోషమేగాని, ఇట్లాంటి వ్యవహారాలలో, దరిద్రంలో కుమలడమో, ఇద్దరిలో ఒకరు రెండోవారిని వంచించడమో, ఏం చేశామా అని తీవ్రపశ్చాత్తాపమో— ఏదోఒకటి జరగకపోతే,

స్వకీయంగా అపరాధం జరిగినట్టుంటుంది. ఎందువల్లనో అది మన లోని ఈర్ష్యవల్లా, మన ఆలోచనల అలవాట్లవల్లా, చిన్నప్పటి బోధనలవల్లా. ఏమో మరి— హరిశ్చంద్రుడట్లా మాలకొలువు లోనే వుండిపోయినట్టు నాటకం అంతమయితే భరించగలమా? రావణుడు సీతని రాణీ చేసుకుని లంకని ఏలాడంటే వొప్పు కుంటామా? ఫిల్ములో మనిషిని చంపినవాడు సుఖంగా తప్పించు కుని ధనవంతుడైనాడంటే? ఇదీ అంతే!

నాలుగయిదురోజులు ఆ వూళ్ళోనే వున్నాను. అతను తన ఇంటికి రమ్మని పిలుస్తాడేమో ననుకున్నాను కాని పిలవ లేదు. రాత్రిళ్ళు హోటల్లో పడుకుని ఆలోచించుకునేవాణ్ణి. ఆ రాధ అందాన్నంతా ఎంత గొప్పగా అనుభవించాడో ఇంకా అంత గొప్పగానూ చూసుకుంటున్నాడా అనే ప్రశ్నలు వొచ్చేవి. కాని అతన్ని ఆ మాట ఎట్లా అడగను?

మర్నాడు హోటల్లో అతన్ని కలుసుకున్నప్పుడు అతని వంక ఇంకా పరీక్షగా చూశాను. అతని వొంటిమీదా, బట్టలమీదా అశ్రద్ధ కనపడుతోంది. మరి, యే ఉద్యోగమూలేని మనిషికి అంతశ్రద్ధ యేముంటుంది? కళ్ళలోకూడా ఏ ఉత్సాహమూ, ఆశా లేవు. కాని— దిగులూ, నిరాశా కూడా లేవు; బాధా లేదు. కాని ఇతని జీవితమే మామూలుగా నడిచివుంటే ఈపాటికి జడ్జీగారి లక్షల ఆస్తి, ఆయనమూలంగా మళ్ళీ ఇతను ఈపాటికి ఓ జడ్జీ కీర్తి, పిల్లలూ, గౌరవం, కార్లు! ఆ నిమిషం వ్యామోహానికి లొంగిపోయి, కలకాలం సంపదానుభవాన్ని, మర్యాదని పోగొట్టు కొని వొంటరిబతుకు బతుకుతున్నాడు. ఈ వూళ్ళో ఏ చిన్న ఇంట్లోనో కాపరం. ఈ హోటళ్ళల్లో, ఆ గుంపులో పని లేకండా

తిరుగుతూ, బతుకుతూ. బుద్ధిలోకూడా ఏ వికాసమూ కనిపించ లేదు. పైగా లోపల చచ్చే సిగ్గుపడుతో వుంటాడు.

"ఏం చేస్తావు పొద్దస్తమానం?"

"ఏంలేదు. ఇల్లానే"

"పిల్లలా?'

"లేరు.?"

"ఏమన్నా చదువుతావా?"

"ఏం చదవను."

"న్యూస్ పేపరూ?"

"ఉహూ"

"ఎందుకు చదవవూ?"

"నాకేం సంబంధం?"

"ఏంపని చేశావోయ్! ఈపని చెయ్యకపోతే ఈపాటికి ఎక్కడ వుండేవాడివో తలుచుకోగలవా?"

"ఊ"

"దిగులెయ్యదా?"

"అప్పుడప్పుడు."

"మరి రాధ ఏంచేస్తోవుంటుంది?"

"వంటా, పొరుగువాళ్ళా, కబుర్లూ, ముఖ్యంగా నేనూ"

"ఆమె జీవితం మాత్రం ఎంత పడిపోయిందో తలుచుకుంటుందా? ఆమె అందంతో, నాట్యంతో ఈ పాటికి...."

"అవును"

"దిగులుపడుతుందా?"

"అప్పుడప్పుడు"

అని ఆగాడు. కాఫీ తాగుతూ ఆలోచిస్తున్నాడు. మొదటిసారి తన జీవితం సమగ్రంగా నా కళ్ళలోంచి చూసుకుంటున్నాడని పించింది. కొంచెంగా పూర్వపు పట్టుదలా, కొంచెతనం వొచ్చాయి అతని కళ్ళల్లోకి.

"ఇన్నేళ్లూ నువ్వేం చేస్తున్నావు?" అన్నాడు.

"ఏం చేస్తున్నాను? ప్లీడరీ. పన్నెండెకరాల పొలం సంపాయించాను. ఓ యిల్లు కట్టాను. నలుగురు పిల్లలు. మా వూళ్ళో కొంతపేరు. నాకేం?"

"ఏం తృప్తిగావుందా?"

"ఏమి?"

"కొంత ఆస్తి సంపాయించి కొంతమంది పిల్లల్ని పెంచుతున్నావు? నువ్వు చేసిన మహాత్కార్యం ఏమిటి?"

"ఏం అంతకన్న మనుషులు యేం చెయ్యాలి?"

"అవును. అంతేలే. కాని—అంతకన్న ఏదో చెయ్యాలనే ప్రయత్నించాను నేను."

"ఏం చేశావు; నా అంతమాత్రం చెయ్యలేదు కద?"

"పోనీ, చెయ్యలేదనుకో. కాని నేనే మామూలుగా వుండిపోతే నేనూ నీమల్లేనే కొంత ఆస్తి సంపాయించి పిల్లల్ని పోషించే వాణ్ణి."

"కాని నీవల్ల ఎవరికి ఏం ఉపయోగం ఇప్పుడు?"

"నీవల్లా? నువ్వులేకపోతే వ్యాజ్యాలు వుండవా, ఆ ఆస్తిని అనుభవించే వాళ్లు ఉండరా? పిల్లల్ని పెట్టి జనాభాని నించే వాళ్లకి తక్కువా?"

"కాని పిల్లలూ, వాళ్ళ చదువులూ, పెళ్లిళ్లూ...."

"అవును వాళ్ళని కన్నావుగనుక ఆ బాధ్యతలు. అవేవో లోకానికి ఏదో గొప్ప ఘనమైన ఉపకారాల్లా మాట్లాడతావేం?"

ఆ సాయంత్రం అతను వెళ్ళాక ఆలోచించాను. అతని మాటలవల్ల నాకు అతనిమీద కోపం ఎక్కువైంది. ఏమిటి తను జీవితపు మామూలు బాధ్యతల్ని ఎగగొట్టడానికి అతనికేమి హక్కువుంది? ఇంక తన సంగతేనా? ఎంత స్వార్థం! అతని కళ్లు తెరవడం నా ధర్మం అనిపించింది.

మర్నాడు కాలవగట్టుకు షికారు వెళ్లాం.

"మరి నువ్వు పెళ్ళిచేసుకుని వొదిలివచ్చిన అమ్మాయి సంగతి ఏమన్నా యోచించావా?"

"ఎట్లా వుంది? ఏం చేస్తోంది?" అన్నాడు. అప్పుడు అది గాడు దూరంగా. తాను పెళ్లిచేసుకున్నానని మరిచేపోయినట్టున్నాడు.

"ఏంలేదు. తండ్రి ఆస్తినంతా ఆమెకు ఇచ్చాడు. ఏదో సంఘసేవ చేస్తో పబ్లిక్‌లైఫ్‌లో ప్రాముఖ్యత సంపాయించుకుంటోంది."

"ఇంకేం!"

"ఇంకేం? ఇంక గతిలేక ఏం చేస్తుంది మరి?"

"ఏం తక్కువయిం దంటావు? మొగవాడూ, పిల్లలేనా? డబ్బు వుందికదూ? కొంచెం సాహసిస్తే అవిమాత్రం లభించేవి కాదా?

"అందరూ నీమల్లే అనుకున్నావా?"

"కాదులే— పోనీ, హాయిగానే వుందిగా. నీకేం దిగులు?"

"ఏం దిగులేమిటి? ఆమె లోపలలోపల ఏం బాధపడుతోందో........"

"బైటబాధలు చాలవూ! బైట సుఖంగా వున్నవాళ్లు లోపల యెంత బాధపడుతున్నారో యోచించేందుకు? యీ వుత్తకబుర్లు మాట్లాడకు. పోనీ ఏ బాధలన్నా ఎవరివన్నా పోగొట్టడానికి ను వ్వేన్నడన్నా ఏం చేశావో చెప్పు. నే నన్యాయం చేశాననే కోపం వల్ల, ఆమె లోపలిబాధ లేమిటో అని దైన్యపడుతున్నావుగాని. నీ కూతురు వితంతువయితే, నీ కూతుర్ని భర్త వొదిలితే ఆమె కోసం బాధపడతావా?"

"ఆ. కాని నివారించే మార్గంలేక ఊరుకుంటాను"

"నివారించేందుకు నేను వొక్కణ్ణే కనపడ్డానన్నమాట. ఒకమార్గం తెలిసికూడా ఏం చెయ్యగలను? అనేవాళ్ళ దయలో నాకేం విశ్వాసం లేదు"

"నే ననేది. పోనీ రారాదా అని."

"ఎక్కడికి?"

"ఆమె దగ్గరికి; నీ భార్యయింటికి."

"వొచ్చి?"

"వుండూ."

"ఇప్పుడు ఆమెకి నే నెందుకు?"

"నేను మాట్లాడుతానుగా."

"కాని రాధని నేను వొదిలేసి వొస్తే దాంటో అన్యాయం నీకేం కనపడదనుకుంటాను."

ఆలోచించాను.

"పోనీ, తెచ్చుకో, ఇద్దరూ ఉండనీ"

"ఏమో! ఆమె వొప్పుకోదు. రాధా ఒప్పుకోదు."

"ఆమెతో, ఈమెతో నేను మాట్లాడతాను. అన్ని ఏర్పాట్లూ చేస్తే నీకేమన్నా అభ్యంతరమా?"

"ఇంత శ్రమ నీ కెందుకో! ఎవరిమీది దయవల్ల ఈ ఏర్పాటంతా?"

"ఒక్క టడుగుతా. నిజం చెప్పాలి" అన్నాను.

"ఊ"

"నీ జీవితం ఇప్పుడు సంతోషంగా వుందా?

"ఉన్నంత వుంది. నీకు వుందా?"

"ఊ"

"అయితే నాకూ ఉంది"

"వాదించకు. నిన్ను చూస్తే ఏదో ఓ గాడిలోపడి, ఇంతే మన బతుకు అని ఆగిపోయినవాడికిమల్లే కనపడుతున్నావు.

"నువ్వా-అంతేకాదు. మనుష లందరూ అట్లానే కనపడ తారు."

"మాకు వీళ్లు లేక. ఓ లక్షరూపాయలుంటే, నేనే జడ్జీ నైతే, ఇంతకన్న సంతోషంగా వుంటాను, అని తెలుసు నాకు. కాని వీలుకావు అవి, అందుకని ఆగిపోయినాను. ఇంక నా పిల్లల పురోభివృద్ధిలో బతుకుతో ముందుకు చూస్తాను. నీ కలాంటివి ఏం లేవు. ఆశలేదు. ఎదగడం ఆగిపోయినావు పాపం!"

అతను నిజమే నన్నట్టు ఆలోచిస్తున్నాడు.

"పోనీ దేనికోసం నువ్వింత విప్లవం తెచ్చుకున్నావో, ఆ సంతోషమన్నా మిగిలిందా నీకు?"

అతను మాట్లాడలేదు.

"నిజం చెప్పు నాతో. దాపరిక మెందుకూ? ఆ వ్యామోహం ఎన్నాళ్లుంది?"

"నాలుగైదేళ్లు."

"ఆ నాలుగేళ్ళ తరువాత ఈ పదిహేనేళ్ళు ఏం లేదు, ఆగిపోయినావు. ఏమన్నా వివేకం వుందా నువ్వు చేసిన పనిలో? తాత్కాలిక వ్యామోహంలో జీవితాన్ని ధ్వంసం చేసుకున్నావు." అతను మెల్లి మెల్లిగా ఆగి మాట్లాడుతున్నాడు.

"ఒప్పుకోను."

"ఒప్పుకోక! వుత్త పెంకితనం. ఇంకా నిజం ఒప్పుకోడం నామోషీ నీకు!"

బాగా పెడుతున్నాను అతని మొహాన.

"నేను చెప్పేమాటలు, నీకు తెలిసినంతవరకు నీతో వాస్తవం చెబుతున్నానని నువ్వు ఒప్పుకోకపోతే, మనం మాట్లాడుకుని ప్రయోజనం లేదు. నాలుగైదేళ్ళూ నే నేమనుభవించానో నువ్వు తెలుసుకుంటే అటుతరవాత పందేళ్లు సమస్త కష్టాలూ అనుభవిస్తేనేం అనిపిస్తుంది, నీకైనా సరే."

"అయిపోయినాయి కద?"

"నా అయిదేళ్ళూ అయిపోయినాయి. ఓనాడు నీ పంద ఏళ్ళూ అయిపోతాయి. ఏమి వాస్తవమైనదీ, లోతైనదీ అనుభవించకుండానే రూపాయల్నీ, పిల్లల్నీ లెఖ్ఖచూసుకుంటో నీ ఆయువు నిండుతుంది. గొప్ప కష్టదినాలూ అయిపోతాయి. అదా? ఈనాడైనా ఆ జ్ఞాపకం చాలు నన్ను గొప్ప గర్వంతో మానవ శ్రేష్ఠుణ్ణి అనిపించేట్టు చేసేందుకు. కాని క్రమంగా కాలం మరుపుని కప్పుతుంది ఎంత గొప్ప అనుభవంమీదనైనా సరే!"

"అదేమిటో ఆ అదృష్టం నాకు కొంచెం చెబుదూ?"

"ఎట్లా చెప్పను? ఏం చెప్పను? ఎట్లా నీకు అర్థమౌ తుంది? పోనీ నే నడిగే సంగతులు నిజం చెబుతావా?"

"తప్పకుండా."

"నీ భార్యకాక, వేరే స్త్రీల నెరుగుదువా?"

"ఊఁ"

"ఎట్లా?"

"డబ్బుతో."

"నిన్ను ప్రేమించి, తా నెరిగిన మనుషుల్లో నువ్వే కావా లని ఏరి నిన్నే ఏ స్త్రీ అయినా కోరిందా?"

"లేదు."

"నీ భార్య గాని, ఇంకో స్త్రీ గాని, నిన్ను విడువలేక, తన చేతుల్లో ఖైదుచేసుకుందా? ఒక్క నిమిషం కనుమరుగైతే నీకోసం తహతహలాడిందా? నీ కళ్ళలోకి చూస్తో, బంధువుల్ని, ఐశ్వర్యాన్ని, లోకాన్ని, తననే మరిచి తల్లిమల్లే నిన్ను రొమ్ము మీదకి తీసుకొని నవ్వి, ఓదార్చి, దిగుళ్ళని తన చూపులతో, కన్నీళ్ళతో లాలించిందా?"

"అన్నీ కవిత్వాలు"

"సరేలే. నేను చెప్పినవి ముందు చాలా అల్పమనుకో. పోనీ ఎప్పుడయినా నువ్వు ఏ సౌందర్యాన్నన్నా చూసి అది కావా అని, దానికోసం సర్వమూ త్యజించగలనని, రాత్రింబవళ్ళు ఆ కోర్కెతో వుండిపోయినావా?"

"లేదు"

"ఇంక నా మాటలు నీకే మర్థమవుతాయి. నే నేమన్నా చెపితే! తక్కిన జీవితం పోనీ, కొత్త యవ్వనంలోనైనా, ఏ లోకంలో వున్నామో మరిచిపోయి, ఇంతకన్న స్వర్గం ఏముందని ప్రతి గంటా ప్రియురాలి నేత్రాల్లో కొత్త సూర్యోదయమయినట్టు వెలగకపోతే, ఆ జీవితానికి అర్థం ఏముంటుంది? ఎంత గొప్ప కానీ, ఎంత ఐశ్వర్యం రానీ తరవాత! కొమ్మలమీది పక్షులమల్లే అవసరంలేని పలుకులు, ఆగని నవ్వులు, ఎడతెరిపిలేని ముద్దులు, నడకలో, మాటలో, చూపులో పొంగి వచ్చే ఉత్సాహాలు— ఆ కాలం పొక్కటేకద ఈ లోకంలోకి స్వర్గాన్ని లాక్కొచ్చేది? ఒకప్పుడన్నా అనుభవాన్ని యెరగని మనిషితో నేనేం మాట్లాడను?"

ఆగాడు జ్ఞాపకం తెచ్చుకుంటో.

"ఏ మాట, మామూలు మాట, దాంటో లేని అర్థాన్ని నీ చెవులకి, పక్కనించి నీ వొంక ఒక్కచూపు. నీ నరాల్లో గొప్ప విద్యుల్లతలు. రాత్రవుతోంది; పువ్వుల్లో, నవ్వుల్లో, నక్షత్రాలలో వూగుతో, అలసి నిద్రపోతూ కూడా నీ పక్కనుండి, నీ రొమ్ము చుట్టూ చేతిని తియ్యలేని అనురాగం. తెల్లారిందంటే, తానూ నువ్వూ పసితనంలోమల్లే ప్రతి స్వల్పస్థితిలో, గాలిలో వూగే గడ్డిపరక చివరి వానబొట్టులో, సోమరిగా తేలిపోయే, తెల్లని మబ్బు మెరుగులో, తూలుతో యెగిరే శీతాకోక చిలకలో, ఇదివరకు చూడని అందాల, ఆనందాల ప్రయోజనాలు; ఓ పూలదండ, పక్కమీది ఓ దిండు, చేతిగాజుకోసం తగూలు నవ్వులు, పెనగులాడటం. రోడ్డుమీది ఓ మొహం, కుక్క కక్కుర్తి, పిచికల సంయోగం, ఈగ కాళ్ళ దులుపు,

అన్నీ నవ్వులాటలే, హాస్యాలే. నిత్యమూ శరీరాలూ, ఒకరికిం కోరు కొత్త. ఇదివరకు ఎరగని మనోభావాల కొత్త వికాసం తెలీడం, ఆశ్చర్యం, ముద్దు, ఒకబట్ట కొంచెం ఒత్తిగిలితే కొత్త డిస్కవరీలాగు యీ ప్రపంచంమీది మాయతెర ఒత్తిగిలినంత సంతోషం. చూడడం, తాకడం, సిగ్గు, బలవంతం, మొదటి రాత్రి థ్రిల్, ప్రియురాలి భుజంమీద అనుకుని చంద్రుడివంక చూస్తో, వెన్నెల ఆమె చంపమీదనించి జారి చీరె చెరగుకింద కన్పించే సగం నీడల్ని చూస్తో రాత్రి రాత్రంతా గడిపావా? ఇట్లాంటివి వున్నాయని ఒప్పుకోరు. వొప్పుకుంటే అట్లా బతక లేరు. అనుభవించినవాళ్లు ఎన్నడూ చెప్పలేరు. నేను చెప్పానా? చెపితే నమ్మరు. నువ్వు నమ్ముతున్నావా?

ఆగాడు.

"ఇప్పుడూ?" అని అడిగాను వూపిరి ఆగి.

"కాని ఎంత గొప్ప అనుభవమూ పాతబడుతుంది. మామూలౌతుంది. రాధ అందంవంటి అందంకూడా కళ్లని కట్టె య్యడం ఆగిపోతుంది ప్రత్యేకమైన సమయాలలోతప్ప. కాని తరవాత........"

ఆగాడు.

"రెండుమూడుసార్లు రాధని వొదిలి వెళ్ళిపోయాను తెలుసా?"

"ఎందుకూ?"

"కొంతకాలానికి, గంటలు బరువుగా వేళ్లాడ్డం ప్రారంభిం చాయి. ఏ ఆసక్తీ లేకండా నిర్జీవంగా అవుతున్నా ననిపించింది.

"అట్లాంటప్పుడే మొగవాడికి ఓ ఉద్యోగం వుండాలి. స్త్రీ నిలవగలదు ఆ కలల్లోనే, గడిచినవికానీ, వొస్తాయనుకునేవి కాని, వాటిల్లో. అందుకనే భరించలేక, ఆ తోచనితనం రాధ తప్పే ననుకుని, నేను వొదులుకున్నవాటి భూతాలు నన్ను తరిమి ఏడిపిస్తే, పోయినాను."

"పోయి?"

"తిరిగాను, ఉద్యోగమూ సంపాయించాను. మళ్ళీ భార్య దగ్గిరికి పోవాలని యోచించాను. రాధ జ్ఞాపకాన్ని రాత్రులు తుడిచి వెయ్యాలని, ఇతర స్త్రీలను డబ్బుతో కొనుక్కున్నాను. ఒక ప్రేమవ్యవహారాన్ని అనుభవించాను."

"మరి?"

"కాని, ఒకసారి గొప్పగా, తృప్తిగా అనుభవించిన శరీరం, మరి జ్ఞాపకమను అలవాటును, అందులో రాధవంటి స్త్రీతో, దాని తరవాత ఇంకేమీ చెయ్యలేం. ఆమె నీతో లేనిది, ఉందని గుర్తు లేంది, ఏ ఉద్యోగమూ చెయ్యలేవు. మళ్ళీ మళ్ళీ తిరిగివొచ్చాను. రాధ కిందికి వంగి పనిచేసుకునేప్పుడు ఆమె బుజాలమీద పడే జుట్టులోంచి మెరిసే బుజాలు, రాత్రులు చీకట్లో మెరిసే ఆమె తొడలూ, అల్లాంటి అందాన్ని— అందమే కాదురా ఒక్కొక్క వొంటో ఓ మృదుత్వం, నీ రక్తాన్ని నీలోంచి, తన చేతుల్లోంచి, రొమ్ముల్లోంచి, తనలోకి లాక్కునే గొప్ప ఆకర్షణ— కవిత్వం కాదు వొంటికే తెలుస్తుంది అది. ఆటు తరవాత యేమీ చెయ్యలేవనుకో. శృంగారం, అట్లాంటి ఆకర్షణ అంత అపురూపం కాబట్టే ప్రపంచంలో మనుషులు యుద్ధాలు, యత్నాలు, విప్లవాలు, మంత్రిత్వాలు చెయ్యగలుగుతున్నారుగాని—

ఫాసిస్టులకీ, కమ్యూనిస్టులకీ, గాంధీగారికీ, బ్రహ్మసమాజంవారికీ- యీ దీక్షపరులందరికీ శృంగారం యెంత నిరోధమో గమనించావా? ప్రేమ—అనే నీరసపదం వాడతారుగాని, అదేదో తల్లీ పిల్లా అట్లాంటివాటిల్లో కనపడవలసిందే! పక్కమీద కలియని ప్రేమ వృత్త నాన్‌సెన్సు. చివరకి పిల్లని కావిలించుకుని ముద్దు పెట్టుకోని తల్లిప్రేమని ఆలోచించు. ఎవరూ నేర్పకండానే పిల్ల తల్లిమెడచుట్టూ చేతులు వేస్తుంది కద!" అని ఆగాడు.

"అదంతా సరేలే. కొత్తజీవితం ప్రారంభించి చూడకూడదూ?"

"అదేగా నేను చెప్పేదీ! ప్రయత్నించి చూశాను. తిరిగి వొచ్చాను. నాకేమనిపించిందంటే, వోసారి గొప్ప శృంగారాన్ని అనుభవించినవాడు, యావజ్జీవం దానికే అంకితమైపోతాడనే నా అనుభవం మాయం కాలేదు. నా లోపలి రక్తంలోకి, ఎముకల్లోకి ఇంకి నన్ను మార్చేసింది నాకు తెలియకుండానే. అది మామధ్య జీవితంలో మమ్మల్ని గొప్ప బంధంతో కట్టేసింది."

"నువ్వు తిరిగి వొచ్చిందాకా రాధ ఏం చేస్తోంది? ఏమీ అనలేదా?"

"అట్లాంటి సంగతి ఒక్క పతివ్రతల్లోనే వుంటుంది ఏనాడైనాసరే. ఆమెకి నేను ఆర్థికంగా మర్యాదకికూడా అవసరం లేదు. డబ్బంతా ఆమెపేర వుంది. నా స్థితి చూసి రెండుసార్లు ఆ డబ్బు పంపించేసింది."

ఇంక మాట్లాడ్డానికి నాకేం తోచలేదు. మర్నాడు ఆవూరు వొదులుతున్నాను. వెళ్ళేప్పుడుమాత్రం, ఆ రాత్రి పొగలకింది లాంతరుస్తంభందగ్గిర అతను——

"నువ్వు వెడుతున్నావు. కొన్నాళ్ళదాకా మళ్ళీ ఏం తోచదు. ఎప్పుడన్నా వొస్తోవుండు!" అన్నాడు.

"పోనీ నువ్వే వొస్తూండకూడదూ?"

"పోనిద్దూ, ఆ పాతమొహాలన్నీ....నా మాటలు నీకేమైనా అర్థమైనాయా?"

"ఊఁ"

"ఏం అర్థంకాలే. పెదవులమీది చిరునవ్వు వొంపులో లక్ష వెన్నెలల మృదుతేజస్సుల్ని చూడడం చాతనైతేగాని—"

అంటో వెళ్ళిపోయినాడు.

"నేను వొచ్చేశాను" అన్నాడు రాజారావు.

చాలా నిశ్శబ్దంగా విన్నారు. ఆ మధ్యలో ఎప్పుడు ఆగిందో ఆగింది వాన.

"ఇంతకీ ఇదంతా భోగంమేళాలు పెట్టడంవల్ల సంభవించిన అనర్థమంటావా రాజారావ్?" అన్నాడు కంట్రాక్టరువీరయ్య.

"అనర్థమో, అర్థమో—అట్లాంటివి జరుగుతాయి మరి, వేశ్యల్ని యిళ్ళకి రానిచ్చి నాట్యమాడించుకుంటే."

అందరూ లేచారు ఇళ్ళకి పోవడానికి. ఇంతలో సూరి శాస్త్రుల్లగారు వొచ్చారు. ఆయన గొప్ప డాక్టరు. పెద్దవాడు. ఆ పెళ్ళిలోకూడా ఓ పెద్ద. ఆయన కొడుకూ డాక్టరే. సూరి శాస్త్రుల్లగారు మా హోస్టు. రామయ్యగారితో ఏదో గబగబ మాట్లాడాడు.

"క్షమించండి. ఉండండి. ఇప్పుడే ఒస్తాను" అని లోపలికి వెళ్ళాడు రామయ్యగారు సూరిశాస్త్రుల్లగారితో సహా.

ఎంతకీ ఎవరూ రారు. అతిధులకి వెళ్లాలో వుండాలో తెలీదు. కొందరు చల్లగా జారుకుంటున్నారు. లోపల కొంచెము హడావిడిగా వుంది.

"ఏదో పోయిందేమో, ఏ నగలో! అబ్బా ఈ పెళ్లిళ్లు! చూచి వొస్తాను వుండండి" అని పెళ్ళికొడుకు మేనమామ వెళ్ళాడు లోపలికి.

అయిదు నిమిషాల్లో తొరతొరగా వొచ్చాడు.

"పెళ్లికొడుకు భోజనం తరవాత లేడు. కనపళ్లేదు. సూరి శాస్త్రుల్లగారి కోడలూ లేదు. వాళ్ళ పెళ్ళి వూరేగింపుకారూ కనపడదు," అని నవ్వుతున్నాడు.

~~~~~~~~~
~~~~~~~~~